సాక్షి అనంతపురం

గురువారం । 11 । జనవరి । 2024



తొలిరోజే 1,350 మ్యాచ్‌లు

'ఆడుదాం ఆంధ్రా' మండల స్థాయి క్రీడా పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు 1,350 మ్యాచ్‌లు జరిగాయి. 8లో



టమాట కిలో రూ.15

కక్కలపల్లి మండీలో బుధవారం టమాట కిలో గరిష్ట ధర రూ.15 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.12 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం

31.7°/18.1°

జిల్లా అంతటా బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి తీవ్రత కొనసాగింది. ఆగ్నేయం దిశగా గాలులు గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

కాచిగూడ-తిరుపతి మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు



గుంతకల్లు: సంక్రాంతి పండగ సెలవుల నేపథ్యంలో ప్రయాణికుల రద్దీ దృష్ట్యా కాచిగూడ–తిరుపతి మధ్య 12వ తేదీ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సీహెచ్ రాకేష్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కాచిగూడ జంక్షన్ నుంచి ఈ రైలు (07041) శుక్రవారం రాత్రి 8.25 గంటలకు బయలుదేరి మరుసటి రోజు శనివారం ఉదయం 9.00 గంటలకు తిరుపతి జంక్షన్ చేరుతుందని పేర్కొన్నారు. ఈ రైలు ఉందానగర్, షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్ నగర్, వనపర్తిరోడ్డు, గద్వాల, రాయచూరు, మంత్రాలయం రోడ్డు, ఆదోని, గుంతకల్లు, తాడిపత్రి, యర్రగుంట్ల, కడప, రాజంపేట, రేణిగుంట మీదుగా తిరుపతికి చేరుతుందని తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

17న జెడ్పీ సమావేశం



అనంతపురం సిటీ: వాయిదాల మీద వాయిదాలు పడుతూ వస్తున్న ఉభయ జిల్లాల జెడ్పీ సర్వసభ్య సమావేశం నిర్వహణకు ఎట్టకేలకు ముహూర్తం ఖరారైంది. ఈ నెల 17న సమావేశం నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జెడ్పీ సమావేశ భవన్‌లో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన ఆ రోజు ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభించనున్నారు. సమగ్ర వివరాలతో హాజరు కావాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

చిన్నారి ప్రాణం తీసిన నిమ్మకాయ



మృతి చెందిన చిన్నారి జస్విత

పెద్దవడుగూరు : ముక్కు పచ్చలారని చిన్నారిని నిమ్మకాయ బలిగొంది. ఈ సంఘటన బుధవారం పెద్దవడుగూరు మండలం మల్లేనిపల్లిలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు... గ్రామానికి చెందిన గోవిందరాజు, దీప దంపతులకు ఏడేళ్ల క్రితం వివాహమైంది. ఏడేళ్ల తరువాత చిన్నారి జస్విత (9 నెలలు) జన్మించింది. చిన్నారి బుధవారం సాయంత్రం ఆడుకుంటూ ఉన్నట్టుండి నిమ్మకాయ నోట్లో పెట్టుకుంది. గొంతులో ఇరుక్కుపోయిన నిమ్మకాయను తీయడానికి కుటుంబ సభ్యులు తీవ్రంగా ప్రయత్నించారు. సాధ్యం కాకపోవడంతో పెద్దవడుగూరులోని ప్రయివేటు క్లినిక్‌కు తీసుకెళ్లారు. అక్కడా వీలు కాలేదు. దీంతో 108 వాహనంలో అనంతపురం తీసుకెళుతూ మార్గమధ్యంలోని పామిడిలో ఓ ప్రయివేటు డాక్టర్ వద్ద చూపించారు. అప్పటికే చిన్నారి శ్వాస ఆగిపోయిందని డాక్టర్ తెలపడంతో అక్కడి నుంచి పామిడి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లి చూపించారు. మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఒక్కగానొక్క కూతురు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరు అయ్యారు.

చిరు వ్యాపారులకు తోడు

వడ్డీ వ్యాపారుల వద్ద చేయి చాచకుండా పెట్టుబడికి అవసరమైన సాయం అందించి చిరు వ్యాపారులకు జగనన్న సర్కారు 'తోడు'గా నిలుస్తోంది. వడ్డీల నుంచి ఉపశమనం కల్పించి వారి జీవితాలకు వెలుగులు ప్రసాదిస్తోంది. జగనన్న తోడు పథకం కింద రూ.10వేలు వడ్డీ లేని రుణం మంజూరు చేస్తోంది. గురువారం ఎనిమిదో విడత రుణసాయం అందించనున్నారు.

- నేడు 'జగనన్న తోడు' 8వ విడత రుణ పంపిణీ
- చిరు వ్యాపారులకు సున్నా వడ్డీకే రుణాలు
- జిల్లాలో 18,598 మందికి లబ్ధి



అనంతపురం: సంప్రదాయ కళాకారులతో సహా చిరు వ్యాపారులు, వీధి వ్యాపారుల ఆదాయాలను స్థిరీకరించడం, ప్రైవేట్, వడ్డీ వ్యాపారులపై ఆధారపడకుండా, వారి ఆదాయాలను మెరుగుపరచడం కోసం రాష్ట్ర ప్రభుత్వం 'జగనన్న తోడు' పథకం ప్రవేశ పెట్టింది. ఈ పథకం కింద ఎటువంటి పూచీకత్తు లేకుండా రూ.10వేలు సున్నా వడ్డీకి రుణం అందిస్తోంది. చిరువ్యాపారులు, వీధి వ్యాపారులు, ఫుట్ పాత్‌పై విక్రయాలు, తోపుడుబండ్లపై కూరగాయలు విక్రయించే వారు, రోడ్డు పక్కన టిఫిన్ సెంటర్లు, గంపలు, బుట్టలలో వస్తువులు విక్రయించే వారికి, సంప్రదాయ వృత్తులైన కళంకారీ, తోలుబొమ్మలు, కుమ్మరి తదితర వ్యాపారులకు లబ్ధి చేకూరుస్తోంది. ఈ రుణాన్ని 12 నెలవారీ వాయిదాల్లో చెల్లించే అవకాశం కల్పించింది. ఈ రుణంపై వడ్డీని ప్రభుత్వం లబ్ధిదారుకు పూర్తిగా రీయింబర్స్‌మెంట్ చేస్తుంది. క్రమం తప్పకుండా రుణం, వడ్డీని చెల్లించిన లబ్ధిదారులందరికీ ప్రభుత్వం కొత్త రుణాలు సులభంగా అందేలా చూస్తోంది.

అర్హులు ఎవరంటే..

జగనన్న తోడు పథకం కింద రూ.10వేల రుణం పొందడానికి ప్రభుత్వం కొన్ని నిబంధనలు విధించింది. 18 ఏళ్లకు పైబడిన మొబైల్ విక్రేతలు, స్థిర విక్రేతలు, సంచార విక్రేతలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.10వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.12వేలు కంటే తక్కువ నెలవారీ ఆదాయం కలిగిన వారు, 3 ఎకరాల కంటే తక్కువ మాగాణి, 10 ఎకరాల కంటే తక్కువ మెట్ట భూమి కలిగిన కుటుంబం, 10 ఇంటూ 10 అడుగుల విస్తీర్ణం కలిగిన దుకాణదారులు అర్హులు.

జిల్లాలో 18,598 మందికి తోడు

రాష్ట్ర ప్రభుత్వం 'జగనన్న తోడు' కింద ఎనిమిదో విడత రుణ సహాయం గురువారం అందించనుంది. జిల్లాలో మొత్తం 18,598 మంది చిరు వ్యాపారులను లబ్ధిదారులుగా గుర్తించారు. బ్యాంకుల ద్వారా వీరికి రుణం అందించనున్నారు. అలాగే ఏడో విడత కాల పరిమితి పూర్తయిన రుణాలకు సంబంధించిన వడ్డీ రూ.59.44 లక్షలను నేరుగా లబ్ధి దారుల బ్యాంకు ఖాతాలకు జమ చేయనున్నారు. రుణ కంతులు సకాలంలో చెల్లించిన లబ్ధిదారులకు ప్రభుత్వం వడ్డీ రాయితీని తిరిగి లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తూ వస్తోంది.

వ్యాపారాభివృద్ధికి ఉపయోగపడింది



జగనన్న తోడు పథకం కింద నాకు బ్యాంకు నుంచి పది వేల రూపాయల రుణం ఇచ్చారు. ఆ డబ్బుతో వ్యాపారం అభివృద్ధి చేసుకున్నాను. మరోసారి ఈ రుణం తీసుకోవాలని అనుకున్నాను. ఈ పథకం చిరు వ్యాపారులకు చాలా మంచిది. ఇప్పటికే రెండు దఫాలు రుణం తీసుకుని సక్రమంగా చెల్లించడంతో వడ్డీ రాయితీ వచ్చింది. ఇదే కాకుండా వైఎస్సార్ పింఛన్ కానుక కింద మా అమ్మకు ప్రతి నెలా రూ.3 వేలు వస్తోంది. వైఎస్సార్ చేయూత కింద మూడు విడతల్లో రూ.56,250 వచ్చింది. వైఎస్సార్ ఆసరా కింద రూ.24 వేలు, వైఎస్సార్ సున్నా వడ్డీ కింద రూ.7,350 జమ అయింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఎప్పటికీ రుణపడి ఉంటాను.

–లక్ష్మీదేవి, ద్వారకానగర్, అనంతపురం

ఎనిమిదో విడత రుణ పంపిణీకి సిద్ధం



జగనన్న తోడు పథకం కింద ఎనిమిదో విడత రుణ పంపిణీకి సర్వం సిద్ధం చేశాం. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం విజయవాడలో లాంఛనంగా ప్రారంభిస్తారు. కలెక్టర్ వీసీ హాల్ నుంచి జిల్లా లబ్ధిదారులకు అందిస్తారు.

– ఐ.నరసింహారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ

జెడ్పీ సీఈఓగా నిడియా దేవి

- ఐఏఎస్ శిక్షణ అనంతరం తొలి పోస్టింగ్ 'అనంత'లో



అనంతపురం సిటీ: జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ)గా వైఖోమ్ నిడియాదేవి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మణిపూర్ రాష్ట్రానికి చెందిన ఈమె 2020 యూపీఎస్సీ పరీక్షల్లో జాతీయ స్థాయిలో 180వ ర్యాంక్ సాధించారు. ఐఏఎస్ శిక్షణ అనంతరం ఆమెకు తొలి పోస్టింగ్ అనంతపురం జెడ్పీ సీఈఓగా వచ్చింది.

సీఈఓగా ఎనిమిదోసారి ఐఏఎస్ అధికారి

అనంతపురం జిల్లా పరిషత్ ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు ఏడుగురు ఐఏఎస్‌లు సీఈఓలుగా బాధ్యతలు నిర్వర్తించారు. వారిలో నలుగురు ఇన్‌చార్జ్‌లు కాగా, మరో ఇద్దరు ఎఫ్ఏసీ హోదాలో సేవలందించారు. 1981 నుంచి 1994 వరకు జిల్లా అభివృద్ధి అధికారులు (డీడీఓ)గా పిలిచేవారు. 1994 మే నుంచి అదే పోస్టును ముఖ్య కార్యనిర్వహణాధికారి(సీఈఓ)గా మార్పు చేశారు. ఎంకేఆర్ వినాయక్ 1981 ఆగస్టు 2 నుంచి 27 వరకు ఇన్‌చార్జ్ సీఈఓగా పని చేశారు. 1982 జనవరి 29 నుంచి 1984 జనవరి 18 వరకు బి.రామారావు రెగ్యులర్ సీఈఓగా పని చేశారు. 1984 జనవరి 19 నుంచి 1984 జూన్ 10 వరకు సి.మొహంతి ఇన్‌చార్జ్ సీఈఓగా సేవలందించారు. 1993 సెప్టెంబర్ 21 నుంచి అక్టోబర్ ఒకటి వరకు బి.అరవిందరెడ్డి ఇన్‌చార్జ్ సీఈఓగా పని చేశారు. 1993 అక్టోబర్ 29 నుంచి డిసెంబర్ 5 వరకు అరవిందరెడ్డి ఇన్‌చార్జ్ హోదాలో పని చేశారు. 2003 నవంబర్ 1 నుంచి 2004 ఏప్రిల్ 6 వరకు శోభాభూషణ్‌కుమార్ సీఈఓ (ఎఫ్ఏసీ)గా పని చేశారు. 2013 జూన్ 24 నుంచి 2014 జూలై 13 వరకు విజయేందిర పూర్తి బాధ్యతలతో సీఈఓగా సేవలందించారు. జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ 2023 ఆగస్టు 23 నుంచి ఎఫ్ఏసీగా బాధ్యతలు చేపట్టి ఇప్పటి వరకు కొనసాగారు. తాజాగా ఎనిమిదో సారి యువ ఐఏఎస్ అధికారి వైఖోమ్ నిడియాదేవి సీఈఓగా నియమితులయ్యారు. ఒకట్రెండు రోజుల్లో ఆమె రెగ్యులర్ సీఈఓగా బాధ్యతలు చేపట్టనున్నారు.

నగరపాలక కమిషనర్‌గా మేఘస్వరూప్

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థ కమిషనర్‌గా వై.మేఘస్వరూప్ నియమితులయ్యారు. ఈయన 2021 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి. ప్రస్తుతం చిత్తూరు అసిస్టెంట్ కలెక్టర్‌గా ఉన్న ఈయన్ను అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ పని చేస్తున్న కమిషనర్ భాగ్యలక్ష్మికి ఇంకా పోస్టింగ్ ఇవ్వలేదు. ఆమెకు మరో రెండ్రోజుల్లో నియామక ఉత్తర్వులు వచ్చే అవకాశం ఉన్నట్లు నగరపాలక సంస్థ వర్గాలు చెబుతున్నాయి.

సాంస్కృతిక క్రీడా సమ్మేళనం.. సర్వం సిద్ధం

- నేటి నుంచి హిల్‌వ్యూ స్టేడియం వేదికగా కార్యక్రమాలు
- కఠోర సాధన చేసిన సత్యసాయి విద్యాసంస్థల చిన్నారులు

ప్రశాంతి నిలయం: ఏటా నిర్వహించే సత్యసాయి విద్యార్థుల క్రీడా సమ్మేళనానికి సర్వం సిద్ధమైంది. ఏటా జనవరి 11న సత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ ఆధ్వర్యంలో క్రీడా సాంస్కృతిక సమ్మేళనం నిర్వహించడం అనవాయితీగా వస్తోంది. ఈక్రమంలోనే గురువారం పుట్టపర్తిలోని సత్యసాయి హిల్‌వ్యూవ్ స్టేడియంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి సెంట్రల్ ట్రస్ట్ ఏర్పాట్లు పూర్తి చేసింది. క్రీడా సమ్మేళనానికి వేదికైన హిల్ వ్యూ స్టేడియంలో ఏర్పాటు చేసిన వేదికను ప్రత్యేకంగా అలంకరించింది. కార్యక్రమంలో భాగంగా ప్రశాంతి నిలయం, బృందావన్, అనంతపురం మహిళా క్యాంపస్, ముద్దేనహళ్లి క్యాంపస్‌లకు చెందిన 2,500 మంది విద్యార్థులు హిల్ వ్యూవ్ స్టేడియం వేదికగా సనాతన భారతీయ సంస్కృతీ, సంప్రదాయాలతో పాటు సాహస క్రీడలను ప్రదర్శించనున్నారు. ఇందుకోసం ఆయా క్యాంపస్‌లలో విద్యార్థులు రెండు వారాలుగా కఠోర సాధన చేస్తున్నారు.

- గురువారం ఉదయం 8 గంటలకు విద్యార్థుల మార్చ్‌ఫాస్ట్‌తో సాంస్కృతిక క్రీడా సమ్మేళనం ప్రారంభమవుతుంది. ప్రశాంతి నిలయం, ముద్దేనహళ్లి, బృందావన్ క్యాంపస్‌ల విద్యార్థులు విన్యాసాలను ప్రదర్శిస్తారు. సాయంత్రం 4.15 గంటలకు ఈశ్వరమ్మ ఇంగ్లిష్ మీడియం, ప్రైమరీ, వైట్‌ఫీల్డ్ సత్యసాయి నర్సింగ్ కళాశాల, అనంతపురం మహిళా క్యాంపస్ విద్యార్థుల ప్రదర్శనలుంటాయి.
- 12వ తేదీ ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి హయ్యర్ సెకండరీ స్కూల్ విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన, 13వ తేదీ సాయంత్రం ముద్దేనహళ్లి విద్యార్థుల ప్రదర్శన ఉంటుంది.
- 14న ఉదయం సత్యసాయి విద్యాసంస్థల సంగీత విభాగంచే సంగీత కచేరీ, సాయంత్రం బృందావన్ క్యాంపస్ విద్యార్థుల నాటిక ఉంటుంది.
- 15వ తేదీన సాంస్కృతి క్రీడా సమ్మేళనంలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతుల ప్రధానోత్సవం, సాయంత్రం ప్రశాంతి నిలయం క్యాంపస్ విద్యార్థుల నాటక ప్రదర్శన ఉంటుంది.



హిల్‌వ్యూ క్రీడా మైదానంలో సాధన చేస్తున్న విద్యార్థులు

గంటల తరబడి ఒకేచోట!

- రైల్వే అధికారుల అనాలోచిత నిర్ణయంతో ప్రయాణికులకు ఇక్కట్లు
- ఒకే స్టేషన్‌లో నిలిపే రైళ్లను పొడిగిస్తే రైల్వేకు గణనీయ ఆదాయం
- ఆ దిశగా చర్యలు తీసుకోవాలంటున్న ప్రయాణికులు

గుంతకల్లు: పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు గమ్యస్థానాలకు చేరుకుని తిరుగు ప్రయాణంలో గంటల తరబడి రైల్వే స్టేషన్లలోనే నిలబడుతున్నాయి. రైల్వే ఉన్నతాధికారుల అనాలోచిత నిర్ణయంతో ఒకే స్టేషన్‌లో నిలబడి పోతున్న రైళ్లను మరింత దూరం పొడిగిస్తే అటు రైల్వేకు ఆదాయంతో పాటు ప్రయాణికులకూ ఉపయోగకరంగా ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు. ఆ దిశగా రైల్వే బోర్డు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

స్టేషన్లలో నిలిచిపోయే రైళ్లు ఇవే..

- సికింద్రాబాద్-కర్నూలు సిటీ మధ్య నడుస్తున్న తుంగభద్ర ఎక్స్‌ప్రెస్ (17023) రోజూ ఉదయం 7.30 గంటలకు సికింద్రాబాద్ జంక్షన్ నుంచి బయలుదేరి మధ్యాహ్నం 12.30 గంటలకు కర్నూలు సిటీ చేరుతుంది. తిరిగి కర్నూలు నుంచి సికింద్రాబాద్ (17024)కు మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరుతుంది. దాదాపు 2.30 గంటల పాటు ఈ రైలును కర్నూలు రైల్వే స్టేషన్‌లోనే ఆపేస్తున్నారు. ఇదే రైలును గుంతకల్లు వరకూ పొడిగించాలనే డిమాండ్ ఏళ్ల తరబడిగా వినవస్తున్నా... నేటికీ ఆ దిశగా రైల్వే అధికారులు చర్యలు తీసుకోలేదు. ఈ రైలును గుంతకల్లు వరకూ పొడిగించడం వల్ల హైదరాబాద్‌కు రాకపోకలు సాగించే వ్యాపారుస్తులు, విద్యార్థులు, ఇతర ప్రయాణికులకు ఉపయోగకరంగా ఉంటుంది.
- తిరుపతి మీదుగా సంచరించే నరసాపూర్ - ధర్మవరం (17248) ఎక్స్‌ప్రెస్ రైలు రోజూ సాయంత్రం నరసాపూర్‌లో 5.45 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 10 గంటలకు ధర్మవరానికి చేరుకుంటుంది. తిరిగి మధ్యాహ్నం 2.20 గంటలకు ధర్మవరం నుంచి బయలుదేరి తిరుపతి మీదుగా నరసాపూర్‌కు చేరుకుంటుంది. దాదాపు 4.20 గంటల పాటు వృథాగా ధర్మవరం రైల్వే స్టేషన్‌లోనే నిలిచి ఉంటే ఈ రైలును అనంతపురం వరకూ పొడిగిస్తే కలియుగ దైవం ప్రత్యక్ష దైవంగా ప్రజలు కొలిచే ఆరాధ్య దైవం వేంకటేశ్వర స్వామి దర్శనానికి వెళ్లే వారికి, విజయవాడకు రాకపోకలు సాగించేవారికి ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.
- విశాఖపట్నం - వైఎస్సార్ కడప మధ్య నడుస్తున్న తిరుమల ఎక్స్‌ప్రెస్ (17488) రైలు కడప జంక్షన్‌కు చేరుకోగానే దాదాపు 9.45 గంటల పాటు నిలబడుతుంది. ఈ రైలు విశాఖపట్నం జంక్షన్‌లో రోజూ మధ్యాహ్నం రెండు గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7.00 గంటలకు కడపకు చేరుతుంది. తిరిగి ఈ రైలు సాయంత్రం 5.45 గంటలకు బయలుదేరుతుంది. అయితే ఈ రైలులో నీటిని నింపేందుకు దాదాపు 80 కిలోమీటర్ల దూరంలో ఉన్న కొండపురం రైల్వేస్టేషన్‌కు తరలిస్తుంటారు. ఆ సమయంలో ఈ రైలు కడప నుంచి కొండపురం రైల్వేస్టేషన్ వరకూ ఖాళీగా రాకపోకలు సాగిస్తుంది. అదే ఈ రైలును గుంతకల్లు వరకూ పొడిగిస్తే వాటర్ ఫిల్లింగ్‌తో పాటు ప్రయాణికులకూ ఉపయోకరంగా ఉంటుందని పలువురు సూచిస్తున్నారు.



అవసరం మేర సేవలు అందించాలి

ప్రయాణికుల అవసరమేర రైల్వే సేవలు అందించాలని రైల్వే ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేస్తున్నా. విజయవాడ, హైదరాబాద్, తిరుపతి నగరాలకు గుంతకల్లు జంక్షన్ మీదుగా మరిన్ని రైళ్లు రాకపోకలు సాగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. తుంగభద్ర ఎక్స్‌ప్రెస్‌ను గుంతకల్లు వరకూ పొడిగించడంతో పాటు కరోనా సమయంలో నిలిపి వేసిన అన్ని రైళ్లనూ పునరుద్ధరించాలి. గుత్తి జంక్షన్ మీదుగా గుత్తిలో నిలపకుండా రాకపోకలు సాగించే పలు రైళ్లకు స్టాపింగ్ సౌకర్యం కల్పించాలి.

– వై.వెంకటరామిరెడ్డి, ఎమ్మెల్యే, గుంతకల్లు

ఈ రైళ్లను పునర్ధుంచండి..

గుంతకల్లు–ధర్మవరం–గుంతకల్లు ఫాస్ట్ ప్యాసింజర్, బెంగుళూరు–విజయవాడ–బెంగుళూరు ప్యాసింజర్ రైళ్లను పునర్ధురించాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. కరోనా సమయంలో ఈ రెండు రైళ్లను అధికారులు నిలిపివేశారు. దాదాపు నాలుగేళ్లు కావస్తున్నా... నేటికీ ఈ రైళ్లను పునరుద్ధరించకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



ఊరికి వెళదాం చలో చలో

మూడు రోజుల పండుగ సంక్రాంతి. భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను ప్రజలు వైభవంగా జరుపుకుంటారు. విద్య, ఉద్యోగాల కోసం నగరాలు, పట్టణాల్లో ఉంటున్న వారు సైతం స్వస్థలాల్లో పండుగ చేసుకునేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. ప్రభుత్వం సంక్రాంతి సెలవులు ఇవ్వడంతో విద్యార్థులు ఊళ్లకు పయనమయ్యారు. విద్యార్థులు, యువతీ యువకులు లగేజీ బ్యాగులతో తరలిరావడంతో అనంతపురం ఆర్టీసీ బస్టాండు బుధవారం కిటకిటలాడింది. బస్సులు రాగానే పరుగులు తీస్తూ సీట్ల కోసం పోటీపడ్డారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం




సీటు కోసం ప్రయాణికుల పాట్లు



అనంతపురం ఆర్టీసీ బస్టాండ్‌కు వస్తున్న ప్రయాణికులు



కిటకిటలాడుతున్న బస్టాండ్



క్లుప్తంగా

ఈ-క్రాప్ వేగవంతం చేయండి


వీసీలో పాల్గొన్న డీఏఓ ఉమామహేశ్వరమ్మ, ఏడీఏలు, ఏఓలు

అనంతపురం అగ్రికల్చర్: రబీ ఈ-క్రాప్, ఈకేవైసీ ప్రక్రియ వేగవంతం చేయాలని వ్యవసాయాధికారులను ఆ శాఖ కమిషనర్ సి.హరికిరణ్ ఆదేశించారు. బుధవారం ఆయన గుంటూరు నుంచి జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ (వీసీ)లో మాట్లాడారు. ప్రస్తుత రబీకి సంబంధించి ఈ-పంట నమోదుకు అప్లికేషన్ ఇచ్చామన్నారు. క్షేత్రస్థాయిలో రైతులు సాగు చేసిన పంట వివరాలు సమగ్రంగా నమోదు చేయాలన్నారు. ఫిబ్రవరి 15లోపు ఈ ప్రక్రియ వందశాతం పూర్తి కావాలన్నారు. 1.75 లక్షల ఎకరాలకుగాను జిల్లాలో ఇప్పటికే 1.66 లక్షల ఎకరాల ఈ-పంట నమోదు ప్రక్రియ పూర్తయిందని, నిర్ణీత గడువులోపు వందశాతం పూర్తి చేయాలన్నారు. పీఎం కిసాన్‌కు సంబంధించి పెండింగ్‌లో ఉన్నవాటికి తక్షణమే ఈకేవైసీ పూర్తి చేయాలన్నారు. ఆర్‌బీకేల్లో తగినంత ఎరువులు నిల్వ ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వీసీలో డీఏఓ ఉమామహేశ్వరమ్మ, ఏడీఏలు, ఏఓలు పాల్గొన్నారు.

డివిజన్ అభివృద్ధికి పాటుపడాలి

- డీఆర్‌ఎం మనీష్ అగర్వాల్


ఉత్తమ ఉద్యోగిగా అవార్డు అందుకుంటున్న హేమంత్

గుంతకల్లు: మరింత బాధ్యతగా వ్యవహరిస్తూ డివిజన్ అభివృద్ధికి పాటుపడాలని రైల్వే ఉద్యోగులకు డీఆర్‌ఎం మనీష్ అగర్వాల్ పిలుపునిచ్చారు. ఈ ఏడాది విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన దాదాపు 47 మంది ఉద్యోగులు డీఆర్‌ఎం అవార్డులకు ఎంపికయ్యారు. వీరికి బుధవారం స్థానిక డీఆర్‌ఎం కార్యాలయంలోని న్యూమీటింగ్ హాల్ అవార్డులను డీఆర్‌ఎం అందజేసి, మాట్లాడారు. ఉద్యోగుల కృషి ఫలితంగా గుంతకల్లు డివిజన్ అన్ని విభాగాల్లో రాణిస్తూ జోనల్‌లో మంచి గుర్తింపు దక్కించుకుందన్నారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎంలు సూర్యనారాయణ, సుధాకర్, సీనియర్ డీపీఓ జయశంకర్‌చౌహాన్, సీనియర్ డీసీఎం మనోజ్, సీనియర్ డీఎఫ్‌ఎం అక్కిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాణేల సేకరణలో ఖాకీ

- అరుదైన నాణేలు సేకరిస్తున్న కానిస్టేబుల్ విష్ణుభగవాన్
- శతాబ్దాల కాలం నాటి 515 దేశాల నాణేలు, కరెన్సీ సేకరణ
- ఉచిత ప్రదర్శనతో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైనం
- గిన్నిస్ బుక్ రికార్డుకు చేరువగా ప్రయత్నాలు


యాడికి ఉన్నత పాఠశాల విద్యార్థులకు నాణేల గురించి వివరిస్తున్న పీసీ విష్ణు భగవాన్

యాడికి: అరుదైన నాణేలను సేకరించి, దేశవిదేశాల ద్రవ్య మారకంపై విద్యార్థులను, ప్రజలను చైతన్య పరుస్తున్న విష్ణుభగవాన్ వరుస రికార్డులను సొంతం చేసుకుంటున్నారు. కానిస్టేబుల్‌గా యాడికిలో విధులు నిర్వర్తిస్తూనే... పురాతన నాణేలు, దేశవిదేశాల కరెన్సీని సేకరించడం అలవాటుగా చేసుకున్నారు. అదే ఆయనను ప్రత్యేకమైన వ్యక్తిగా సమాజానికి పరిచయం చేసింది.


నాణేల ప్రదర్శనను తిలకిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

స్నేహితుడి స్ఫూర్తితోనే

తాడిపత్రికి చెందిన విష్ణుభగవాన్ ఓ రోజు స్నేహితులతో కలసి క్రికెట్ ఆడుతుండగా నూర్‌బాషా అనే స్నేహితుడు వచ్చి 1947వ సంవత్సరానికి చెందిన నాణేన్ని చూపించాడు. ఆ సమయంలో క్రికెట్ ఆడడం మానేసి అందరూ ఎంతో ఆసక్తితో అతని చుట్టూ గుమిగూడారు. అలా అందరి దృష్టిని ఆకర్షించాలనుకున్న విష్ణుభగవాన్... ఆ నాణేన్ని నూర్‌బాషా ద్వారా పొంది, తర్వాత పురాతన నాణేల సేకరణను అలవాటుగా చేసుకున్నారు. ఈ క్రమంలోనే 2008లో సివిల్ కానిస్టేబుల్‌గా హైదరాబాద్‌కు శిక్షణకెళ్లినప్పుడు చార్మినార్ ప్రాంతంలో విక్రయిస్తున్న పురాతన నాణేలు, దేశ విదేశాల కరెన్సీని కొనుగోలు చేశారు. అలా మొదలైన ప్రస్తానం కొనసాగుతూ వచ్చింది. ప్రస్తుతం ఆయన వద్ద మొదటి ప్రపంచ యుద్ధంలో కలిసి ఉన్న దేశాలు, రెండవ ప్రపంచ యుద్ధంలో విడి పోయిన దేశాలు, స్వతంత్ర్య రాజ్యాలు, గణతంత్ర దేశాలు, దీవులు కలుపుకుని 515 దేశాలకు చెందిన పురాతన కాలం నాటి 3 వేలకు పైచిలుకు నాణేలు, వెయ్యికి పైగా ప్రపంచ దేశాల కరెన్సీ ఉంది.

ఉచిత ప్రదర్శనలతో అవగాహన

తాను సేకరించిన పురాతన నాణేలు, కరెన్సీని స్నేహితుల సహకారంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత ప్రదర్శనలు ఏర్పాటు చేస్తూ వాటిపై విద్యార్థులకు విష్ణుభగవాన్ అవగాహన కల్పిస్తున్నారు. భావితరాలకు పురాతన సంపదను కళ్లకు కట్టినట్లు చూపిస్తూ పలువురి మన్ననలు అందుకున్నారు. రాయలచెరువు, యాడికి, కోనుప్పలపాడు, నిట్టూరు ప్రభుత్వ పాఠశాలతో పాటు పుట్లూరు, అనంతపురం, తిరుపతి, బళ్లారి, కలికిరి, గుంతకల్లు, బెంగళూరు, గౌరిబిదనూరు తదితర ప్రాంతాల్లోనూ ఉచిత ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. దేశ చరిత్రతో పాటు పురాతన కాలం నాటి ద్రవ్య వినిమయంపై విద్యార్థులతో పాటు ప్రజలనూ చైతన్య పరుస్తుండడంతో అంతర్జాతీయ స్థాయిలో 3, జాతీయ స్థాయిలో 7 అవార్డులు దక్కాయి. ప్రస్తుతం గిన్నీస్ వరల్డ్ బుక్ రికార్డుకు అత్యంత సమీపంలో చేరుకున్నారు.

గిన్నిస్ బుక్ రికార్డు సాధిస్తా..



నాణేల ప్రదర్శనలో ప్రపంచ రికార్డును దక్కించుకున్న విష్ణుభగవాన్

ప్రపంచంలోని పురాతన నాణేలు, కరెన్సీ సేకరించి గిన్నీస్ బుక్ రికార్డు సొంతం చేసుకోవడమే నా ఆశయం. ఇందు కోసం 17 ఏళ్లుగా శ్రమిస్తున్నా. పురాతన నాణేలు, కరెన్సీపై విద్యార్థులను చైతన్య పరిచేందుకు పాఠశాలల్లో ప్రదర్శనకు ఉంచుతుంటాను. ఆ సమయంలో పిల్లల కళ్లలో కనిపించే సంతోషం నాకెంతో సంతృప్తినిస్తోంది. నాపై అధికారుల సలహాలు, సూచనలతో ఖాళీ సమయాల్లో మరిన్ని చోట్ల ఉచిత ప్రదర్శనలు స్నేహితులతో కలసి చేస్తుండటం ఆనందంగా ఉంది.

– విష్ణుభగవాన్, యాడికి


10వ శతాబ్దంలోని గంగేయ రాజుల కాలం నాటి బంగారు నాణెం


9వ శతాబ్దం నాటి రాజరాజచోళ బంగారు నాణెం


3వ శతాబ్దంలోని సముద్రగుప్తుని బంగారు నాణెం


1633లో విజయనగర సామ్రాజ్యంలోని వెంకటపతిరాయలు బంగారు నాణెం


క్రీస్తుపూర్వం 5వ శతాబ్దం నాటి సౌరాష్ట్ర నాణెం

జనవాక్కు

అర్హులకు న్యాయం



మొదట నాకు వికలాంగ పింఛన్ వచ్చేది. అయితే టీడీపీ ప్రభుత్వంలో పింఛన్ తొలగించారు. కంటి చూపు కనబడకపోయినా పింఛన్ మాత్రం అందలేదు. సదరంలో ఆన్‌లైన్‌లో అనర్హుడిగా నమోదు చేశారు. అయితే ప్రస్తుతం సమస్యను వలంటీర్‌కు తెలిపి మరోమారు సదరంకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. పింఛన్ మంజూరు కావడంతో నెల నెలా ఇంటి వద్దకే వచ్చి రూ.3000 పింఛన్ అందిస్తున్నారు. అర్హత ఉంటే సంక్షేమ పథకాలను ఇంటివద్దకే అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోమారు కూడా సీఎం కావాలని కోరుకుంటున్నాను.

– పులి శ్రీనివాసరెడ్డి, రామసాగరం, బెళుగుప్ప

మేలు ఎన్నటికీ మరువం



నేను, నా భర్త గోవిందు.. ఇద్దరమూ దివ్యాంగులమే. సాధారణ వ్యక్తుల్లా పని చేయలేని స్థితి మాది. మా పరిస్థితిపై కరుణించి సంక్షేమ పథకాల లబ్ధి చేకూర్చాలంటూ గత ప్రభుత్వంలో నాయకులను ప్రాధేయపడ్డాం. అయినా ఫలితం దక్కలేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నాకు, నా భర్తకు ఇద్దరికీ దివ్యాంగుల కోటా కింద చెరో రూ.5 వేలు చొప్పున మొత్తం రూ.10 వేలు పింఛన్ అందుతోంది. దీంతో మా ఆర్థిక ఇబ్బందులు దూరమయ్యాయి. అమ్మ ఒడి పథకం వర్తించడంతో కుమార్తె చదువులకు ఢోకా లేదు. సీఎం వైఎస్ జగన్ మేలును ఎన్నటికీ మరువం.

– బోయ పార్వతి, కొర్రకోడు, కూడేరు మండలం

సొంతిల్లు దక్కింది



సొంతిల్లు లేక పదేళ్లుగా అద్దె ఇంట్లోనే నెట్టుకొచ్చాం. గత ప్రభుత్వంలో పలుమార్లు సొంతింటి కోసం దరఖాస్తు చేసుకున్నా. ఇచ్చిన దరఖాస్తులన్నీ జన్మభూమి కమిటీ వాళ్లు చెత్తకుప్పలో పడేసేవాళ్లు. ఇక మాకు సొంతిల్లు రాదనే అనుకున్నాం. ఇలాంటి పరిస్థితిల్లో వైఎస్ జగన్ సీఎంగా బాధ్యతలు చేపట్టి మా బతుకులు బాగు చేశారు. నాకు సొంతిల్లు మంజూరైంది. ఇంటి నిర్మాణం కూడా పూర్తయింది. మాకు గూడు కల్పించిన దేవుడు జగనన్న. ఆయనకే మా మద్దతు.

– రాజమ్మ, తెనగల్లు, కుందుర్పి మండలం

మా పాలిట దేవుడు



తలసేమియాతో బాధపడుతున్న నా ఇద్దరు కుమారుల వైద్య సేవలకయ్యే ఖర్చును అందేలా చేసి సీఎం వైఎస్ జగన్ మా పాలిట దేవుడయ్యారు. ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్న మాకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. వీరిలో ఇద్దరు పిల్లలు తలసేమియాతో బాధపడుతున్నారు. నెలలో కనీసం రెండు సార్లు ఆస్పత్రికి పిలుచుకెళ్లి చికిత్స చేయించుకుని రావాలి. ఆస్పత్రికి వెళ్లినప్పుడల్లా రూ.20 వేల వరకూ ఖర్చు వచ్చేది. దీంతో కుటుంబ పోషణ భారంగా మారింది. కష్టాల్లో ఉన్న మాకు కొండంత ధైర్యాన్ని ఇస్తూ ఒక్కొక్క పిల్లాడికి రూ.10 వేలు చొప్పున ఇద్దరికీ రూ.20 వేలు పింఛన్ అందేలా చేశారు. పిల్లల చికిత్సకు ఢోకా లేకుండా పోయింది. సీఎం వైఎస్ జగన్‌కు ఎంతో రుణపడ్డాం.

– వీరాంజనేయులు, పెద్దవడుగూరు

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

అనంతపురం క్రైం: స్థానిక కృపానందనగర్‌లో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. అనంతపురం టూటౌన్ సీఐ శివరాముడు తెలిపిన మేరకు... శ్రీనివాసులు కుటుంబం కృపానందనగర్‌లో నివాసముంటున్న శ్రీనివాసులు కుమారుడు ఫణీంద్ర (25) సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా బెంగళూరులో పని చేసేవాడు. కొద్ది రోజుల క్రితం ఉద్యోగం వదులుకుని మరో కంపెనీకి దరఖాస్తు చేసుకున్నాడు. అందులో భాగంగా అనంతపురం వచ్చి తల్లిదండ్రుల వద్దే ఉంటున్నాడు. మరో కంపెనీ నుంచి కాల్‌లెటర్ రాలేదు. దీని కోసం ఎదురు చూసిన ఆయన అనవసరంగా ఉన్న ఉద్యోగాన్ని వదులుకున్నానని మానసికంగా కుంగిపోయాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గదిలోంచి ఎంతసేపటికీ కుమారుడు బయటకు రాక పోవడంతో తల్లి వెళ్లి తలుపులను బలంగా తెరిచి చూడడంతో విషయం వెలుగుచూసింది. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

తొలిరోజే 1,350 మ్యాచ్‌ల నిర్వహణ


బ్రహ్మసముద్రంలో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీ తలారి రంగయ్య

అనంతపురం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా బుధవారం మండల స్థాయి టోర్నీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. అన్ని మండలాల్లోనూ క్రీడాకారులకు టీ- షర్టులు అందజేశారు. తొలి రోజే జిల్లా వ్యాప్తంగా 1,350 మ్యాచ్‌లు జరిగాయి. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో క్రీడల్లో క్రీడాకారులు హోరాహోరీగా తలపడ్డారు. మండల స్థాయిలో పోటీల నిర్వహణకు ప్రభుత్వం ఒక్కో మండలానికి రూ.25వేల చొప్పున నిధులు మంజూరు చేసింది. ఆడుదాం ఆంధ్రా పోటీలను తొలి దశ తరహాలోనే అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో చక్కగా నిర్వహిస్తుండడం గమనార్హం. ఇందులో విజేతగా నిలిచిన వారు నియోజకవర్గ స్థాయిలో తలపడాల్సి ఉంటుంది. ఈ నెల 23వ తేదీ వరకూ మండల స్థాయి పోటీలు జరుగుతాయి. 24 నుంచి 30వ తేదీ వరకూ నియోజకవర్గ స్థాయి పోటీలు ఉంటాయి.

'ఆరోగ్య సురక్ష'లో 3,727 మందికి ఓపీ సేవలు


గుత్తిలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

అనంతపురం కార్పొరేషన్: జిల్లాలోని ఎనిమిది పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించారు. మొత్తం 3,727 మందికి వైద్యులు ఓపీ సేవలందించారు. దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న ఓ వ్యక్తిని జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేసినట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబదేవి తెలిపారు.

పశుశాఖ 'మినిస్టీరియల్' రాష్ట్ర కమిటీలో చోటు


శ్రీనివాసులు

అనంతపురం అగ్రికల్చర్: పశుసంవర్ధకశాఖ మినిస్టీరియల్ యూనియన్ రాష్ట్ర కమిటీ అసోసియేట్ అధ్యక్షుడిగా జిల్లాకు చెందిన పశుశాఖ సూపరింటెండెంట్ బి.శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం విజయవాడలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నూతన కమిటీని ఎంపిక చేశారు. ఇందులో అధ్యక్షుడిగా కేవీ రాఘవులు (చిత్తూరు), ప్రధాన కార్యదర్శిగా కృష్ణారావు (కృష్ణా జిల్లా)తో పాటు కార్యవర్గ సభ్యులనూ ఎన్నుకున్నారు.

న్యాక్ గ్రేడ్‌కు అందరి సహకారం కావాలి


ప్రొఫెసర్లతో సమీక్షిస్తున్న వీసీ రంగజనార్దన

అనంతపురం: జేఎన్‌టీయూ(ఏ)ను న్యాక్ నమూనా పీర్ కమిటీ బుధవారం సందర్శించింది. అన్నా యూనివర్సిటీ, చెన్నై ఎమిరేటర్స్ ప్రొఫెసర్ టి.త్యాగరాజన్ ఆధ్వర్యంలోని కమిటీ లైబ్రరీ, సెంట్రల్ కంప్యూటర్ ల్యాబ్, ఎలక్ట్రికల్ విభాగం, మెకానికల్, ఎలక్ట్రానిక్స్ , కంప్యూటర్ సైన్సెస్ విభాగాలను పరిశీలించింది. అనంతరం కమిటీతో కలిసి ప్రొఫెసర్లతో సమీక్ష నిర్వహించారు. తొలుత వీసీ జింకా రంగజనార్దన జేఎన్‌టీయూకు సంబంధించి సిలబస్ రూపకల్పన, కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్ట్, ఇంటర్న్‌షిప్, అవుట్‌కమ్ బేస్డ్ ఎడ్యుకేషన్, స్టూడెంట్ ఫ్యాకల్టీ నిష్పత్తి, రీసెర్చ్ ఎన్ఐఆర్‌ఎఫ్ ర్యాంకింగ్, ఎన్‌బీఏ తదితర అంశాలను వివరించారు. న్యాక్‌లో మంచి గ్రేడ్ సాధించాలంటే అందరి సహకారం అవసరం కావాలన్నారు. కార్యక్రమంలో రెక్టార్ విజయకుమార్, రిజిస్ట్రార్ సి.శశిధర్, డైరెక్టర్ జీవీ సుబ్బారెడ్డి, ప్రొఫెసర్ ఈ.కేశవరెడ్డి, ప్రొఫెసర్ ఎ.సురేష్‌బాబు, ప్రొఫెసర్ ఈశ్వరరెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి


రామలక్ష్మి (ఫైల్)

పెద్దపప్పూరు: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఓ వివాహిత మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... పెద్దవడుగూరు మండలం కండ్లగూడూరు గ్రామానికి చెందిన శ్రీనివాసరెడ్డి నాలుగు నెలల క్రితం వైఎస్సార్ జిల్లా రైల్వే కొండాపురం సమీపంలోని ఉత్తికాయలపల్లికి చెందిన రామలక్ష్మి (26)ని పెళ్లి చేసుకున్నాడు. బుధవారం సాయంత్రం అత్తారింటి నుంచి భార్యను పిలుచుకుని ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి బయలుదేరిన శ్రీనివాసరెడ్డి... పెద్దపప్పూరు మండలం చిన్నయక్కలూరు సమీపంలోకి చేరుకోగానే వాహనం అదుపు తప్పి కిందపడ్డారు. స్వల్ప గాయాలతో శ్రీనివాసరెడ్డి బయటపడ్డాడు. తీవ్రంగా గాయపడిన రామలక్ష్మిని తాడిపత్రిలోని ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. సమాచారం అందుకున్న ఎస్ఐ శరత్‌చంద్ర అక్కడకు చేరుకుని పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు పట్టారు.

కుక్కల దాడిలో గొర్రె పిల్లల మృతి

అమడగూరు: కుక్కల దాడిలో 90 గొర్రెపిల్లలు మృతి చెందాయి. బాధితులు తెలిపిన మేరకు... తాడిమర్రికి చెందిన గొర్రెల కాపర్లు పోతులయ్య, నారాయణస్వామి, శివ వారం రోజుల క్రితం మేపునకు గొర్రెలను తోలుకొని అమడగూరు మండలం మహమ్మదాబాద్ సమీపంలోకి చేరుకున్నారు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన రైతు బుజ్జి పొలంలో మందను వదిలారు. బుధవారం రాత్రి ఉన్నఫళంగా ఊరు కుక్కలు మందలోకి చొరబడి బీభత్సం సృష్టించాయి. గమనించిన కాపర్లు వెంటనే కుక్కలను అక్కడి నుంచి తరిమికొట్టారు. ఈ లోపు కుక్కల బారిన పడిన 90 గొర్రె పిల్లలు అక్కడికక్కడే మృతి చెందాయి.

పేకాటరాయుళ్ల అరెస్ట్

అనంతపురం క్రైం: నగర నడిబొడ్డున అద్దె ఇంట్లో పేకాట ఆడుతూ 13 మంది పట్టుబడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురంలోని సాయినగర్ 2వ క్రాస్‌లోని ఓ ఆస్పత్రి పక్కనే ఉన్న ఇంటిని రామచంద్రారెడ్డి, పుల్లారెడ్డి, నారాయణస్వామి, నాగేంద్ర, తదితరులు అద్దెకు తీసుకుని, పేకాట స్థావరంగా మార్చేశారు. బుధవారం అందిన సమాచారం మేరకు అనంతపురం రెండో పట్టణ సీఐ శివరాముడు, సిబ్బంది అక్కడకు చేరుకుని తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో పేకాట ఆడుతూ నిర్వాహకులతో పాటు 13 మంది యువకులు పట్టుబడ్డారు. వీరి నుంచి రూ. 2 లక్షలు నగదు, 13 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేశారు.

12 నుంచి సాఫ్ట్‌బాల్ సౌత్ జోన్ పోటీలు

అనంతపురం: ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకూ తెలంగాణలోని జనగామలో జరిగే సౌత్ జోన్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పురుషుల, మహిళా జట్ల సన్నాహక శిక్షణా శిబిరం అనంత క్రీడాగ్రామంలో నిర్వహించారు. ఈ నెల 2వ తేదీ నుంచి 10వ తేదీ వరకు వీరి శిక్షణ కొనసాగింది. బుధవారం ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీ సాఫ్ట్‌బాల్ ఫెడరేషన్ సీఈఓ వెంకటేశులు, కార్యదర్శి నాగేంద్ర ముఖ్యఅతిథులుగా హాజరై, మాట్లాడారు. సౌత్‌జోన్ పోటీల్లో సత్తా చాటాలని పిలుపునిచ్చారు. వివిధ టోర్నీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి దేశంలోనే ఆంధ్రప్రదేశ్ జట్టు ప్రత్యేకతను చాటుకుంటోందన్నారు. కార్యక్రమంలో కోచ్‌లు బద్రి, సాయి, సింహాద్రి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


సౌత్ జోన్ పోటీల్లో ప్రాతినిధ్యం వహించే ఆంధ్రప్రదేశ్ జట్టు

ఏపీ బాల్ బ్యాడ్మింటన్ జట్టుకు రెండో స్థానం

అనంతపురం: సీనియర్ నేషనల్ బాల్ బ్యాడ్మింటన్ పురుషుల చాంపియన్‌షిప్ రన్నరప్‌ను ఏపీ జట్టు దక్కించుకుంది. మహారాష్ట్రలోని గచ్చిరోలీలో బుధవారం జరిగిన ఫైనల్ పోటీలో భారతీయ రైల్వే జట్టుతో ఏపీ జట్టు తలపడింది. భారతీయ రైల్వే జట్టు విజయం సాధించి టైటిల్‌ను దక్కించుకోగా రెండో స్థానంలో ఏపీ జట్టు నిలిచింది. జట్టులో అనంత క్రీడాకారులు ఉండడం విశేషం. మూడో స్థానంలో కర్ణాటక, నాల్గో స్థానంలో కేరళ జట్లు నిలిచాయి. స్టార్ ఆఫ్ ఇండియా అవార్డును రూపేంద్ర కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా జట్టు సభ్యులను ఆంధ్రప్రదేశ్ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రెసిడెంట్ విజయశంకర్‌రెడ్డి, జనరల్ సెక్రెటరీ రావు వెంకట్రావు అభినందించారు.


ఆంధ్రప్రదేశ్ క్రీడాకారులతో జట్టు యాజమాన్య సభ్యులు

యువకుడి ఆత్మహత్య

తాడిపత్రి: రైలు కిందపడి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు... తాడిపత్రి మండలం అక్కన్నపల్లికి చెందిన శ్రీనివాసులు, కాంతమ్మ దంపతుల రెండో కుమారుడు విశ్వనాథ్ (19) బేల్దారి పనులతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో పని ప్రాంతంలో పరిచయమైన ఓ వివాహితతో చనువుగా ఉంటూ వచ్చాడు. ఈ విషయం ఆమె కుటుంబ సభ్యులకు తెలియడంతో వారు తనను మందలిస్తారని, దీంతో తమ కుటుంబ పరువు బజారున పడుతుందని భయపడిన విశ్వనాథ్... బుధవారం ఉదయం యల్లనూరు రోడ్డులోని రైల్వే లెవల్ క్రాసింగ్ వద్దకు చేరుకుని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న జీఆర్పీ ఎస్ఐ నాగప్ప అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

కలెక్టరేట్ ఇన్‌చార్జ్ ఏఓగా బాలాజీ

అనంతపురం అర్బన్: కలెక్టరేట్ పరిపాలనాధికారి (ఏఓ) ఇన్‌చార్జ్ బాధ్యతలను ఇ-సెక్షన్ సూపరింటెండెంట్ బాలాజీకి అప్పగిస్తూ ఈ నెల 9న కలెక్టర్ ఎం.గౌతమి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆ స్థానంలో ఉన్న కె.శ్రీధర్ వ్యక్తిగత కారణాలతో దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. అంతే కాక స్వచ్ఛంద ఉద్యోగ విరమణకు ఆయన దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో బాలాజీకి అదనపు బాధ్యతలను అప్పగించారు.

మృతుడు 'అనంత' వాసే

అనంతపురం సిటీ: జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ సమీపంలో మంగళవారం సాయంత్రం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి ఆచూకీ లభ్యమైందని జీఆర్పీ ఎస్ఐ విజయకుమార్ బుధవారం తెలిపారు. మృతుడిని అనంతపురంలోని పాతూరు భవానీ నగర్‌కు చెందిన ఖాజీ నూర్ మహమ్మద్(56)గా గుర్తించామన్నారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. ప్రైవేటు బస్సు డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకునే నూర్ మహమ్మద్.. అనారోగ్య సమస్యలతో సతమతమయ్యేవాడు. వాటిని భరించలేక తాగుడుకు అలవాటుపడ్డాడు. ఈ క్రమంలోనే జీవితంపై విరక్తి పెంచుకున్న ఆయన మంగళవారం సాయంత్రం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లుగా కేసు విచారణలో వెలుగు చూసిందని రైల్వే పోలీసులు తెలిపారు.

వైద్య రంగానికి సీఎం జగన్ పెద్దపీట

• మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్య, వైద్యానికి పెద్దపీట వేశారు. తద్వారా పేద, సామాన్య మధ్య తరగతి ప్రజలకు ఖరీదైన విద్య, వైద్యాన్ని ఉచితంగా అందించారని మేయర్ వసీం పేర్కొన్నారు. బుధవారం నగరంలోని బుడ్డప్ప నగర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందరికీ ఆరోగ్యం అందించడమే సీఎం జగన్ సంకల్పమన్నారు. అందులో భాగంగా ఇప్పటికే ఆస్పత్రులను బలోపేతం చేయడం జరిగిందన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి చొరవతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి రూ.30 కోట్ల ప్రభుత్వ వాటాను విడుదల చేశారన్నారు. తద్వారా పేద ప్రజలకు 8 రకాల స్పెషాలిటీ సేవలు ఉచితంగా అందిస్తున్నట్లు వెల్లడించారు. నాడు–నేడు కింద రూ.300 కోట్లతో ఎంసీహెచ్ బ్లాక్, సర్జికల్ బ్లాక్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రూ.23.75 కోట్లతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో క్రిటికల్ కేర్ బ్లాక్ పనులు జరుగుతున్నట్లు పేర్కొన్నారు. ప్రజలకు అనారోగ్య సమస్యలు లేకుండా ఆరోగ్యంగా జీవించాలన్న సంకల్పంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టారన్నారు. మొదటి దశలో ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారన్నారు. దీర్ఘకాలిక సమస్యలతో బాధపడేవారికి నెట్‌వర్క్, ప్రభుత్వ ఆస్పత్రుల్లో సేవలందించేలా చర్యలు తీసుకుంటున్నారన్నారు. ప్రజలు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, కార్పొరేటర్లు సంపంగి రామాంజనేయులు, కమల్ భూషణ్, కార్యదర్శి సంగం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న మేయర్ వసీం

చెత్త తరలింపునకు చర్యలు

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని పాతూరు మార్కెట్ ప్రాంతంలో బుధవారం డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డితో కలసి మేయర్ పర్యటించారు. కార్మికుల సమ్మెతో పేరుకుపోయిన చెత్తను జేసీబీ, ట్రాక్టర్ సహాయంతో కంపోస్టు యార్డుకు తరలించారు. మేయర్ మాట్లాడుతూ.. ప్రజలను దృష్టిలో ఉంచుకుని రెగ్యులర్ కార్మికులతో పనులు చేయిస్తున్నట్లు తెలిపారు. వివిధ డివిజన్లలో స్థానిక కార్పొరేటర్లను సమన్వయం చేసుకుంటూ ఎప్పటికప్పుడు చెత్తను తరలించేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి సంగం శ్రీనివాసులు, కార్పొరేటర్లు బాబాఫక్రుద్దీన్, కమల్‌భూషణ్, నాయకులు సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో ప్రయాణించు.. గిఫ్ట్ పట్టు


ప్రయాణికులకు గిఫ్ట్ అందజేస్తున్న డిపో మేనేజర్ నాగభూపాల్

అనంతపురం సెంట్రల్: ఏపీఎస్ ఆర్టీసీ అనంతపురం–నార్పల రూట్‌లో ప్రయాణించిన ప్రయాణికులకు లక్కీ డిప్ ద్వారా విజేతలను ఎంపిక చేశారు. బుధవారం డిపో కార్యాలయంలో లక్కీ డిప్ నిర్వహించారు. మొదటి బహుమతి నారాయణ స్వామి, రెండవ బహుమతి రమాదేవి, మూడవ బహుమతి కృష్ణయ్య దక్కించుకున్నారు. ఆర్టీసీ బస్సులను ప్రయాణికులు ఆదరించేందుకు ప్రభుత్వం ఈ లక్కీడిప్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డీఎం నాగభూపాల్ తెలిపారు.

యార్డులో మరిన్ని సౌకర్యాలు

అనంతపురం అగ్రికల్చర్: దేశంలో అతిపెద్ద చీనీ మార్కెట్‌గా అనంతపురం మార్కెట్‌యార్డు రైతులకు విశేష సేవలు అందిస్తోందని యార్డు చైర్మన్ ఏ.ఫయాజ్ తెలిపారు. బుధవారం స్థానిక మార్కెట్ యార్డు హాలులో సెలెక్షన్ గ్రేడ్ సెక్రటరీ ఆర్.జయలక్ష్మి అధ్యక్షతన పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గత నాలుగేళ్లుగా మార్కెట్‌యార్డు ద్వారా అందించిన సేవలు, అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన ప్రగతి, వెచ్చించిన ఖర్చు, భవిష్యత్తు కార్యాచరణ తదితర అంశాలపై చర్చించారు. ఏటా 70 వేల నుంచి 80 వేల మెట్రిక్ టన్నులు చీనీ క్రయ విక్రయాలతో రూ.80 నుంచి రూ.90 కోట్ల టర్నోవర్ జరుగుతోందన్నారు. ఏడాది పొడవునా చీనీ మార్కెట్ ఈ–నామ్ పద్ధతిలో కార్యకలాపాలు సాగించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. దీంతో చీనీ పండించే చిన్న సన్నకారు రైతులకు చాలా ఉపయోగమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రోత్సాహం, స్థానిక ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి సహకారంతో రైతులు, ట్రేడర్లకు మరిన్ని సదుపాయాలు కల్పించడానికి త్వరలోనే ఓపెన్‌షెడ్ అందుబాటులోకి తెస్తామన్నారు. అన్ని వర్గాలకు అనువుగా కూరగాయల మార్కెట్ అభివృద్ధి చేస్తామన్నారు. పశువులు, జీవాల సంతలను పటిష్టం చేశామన్నారు. గత నాలుగేళ్లలో మార్కెట్ యార్డుకు వివిధ రూపాల్లో రూ.12.50 కోట్ల మేర పన్ను వసూలు చేసి యార్డు అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.


మాట్లాడుతున్న మార్కెట్‌యార్డు చైర్మన్ ఏ.ఫయాజ్

బోగస్ ఓట్లు తొలగించాలి

రాప్తాడు: మండలంలోని భోగినేపల్లిలో అధికారులు క్షేత్రస్థాయిలో విచారించి బోగస్ ఓట్లను తొలగించాలని బుక్కచెర్ల సొసైటీ అధ్యక్షుడు కుర్లపల్లయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు భాగంటి నారాయణ రెడ్డి, బుల్లె రామకృష్ణ, ఓబిరెడ్డి, నాగేంద్ర తదితరులు కోరారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో ఈడీటీ మల్లికార్జునకు వినతిపత్రం ఇచ్చారు. ఇటీవల క్షేత్రస్థాయిలో పర్యటించిన అధికారులు గ్రామంలో దాదాపు 90 ఓట్లు తొలగించడానికి నోటీసులు అందజేశారన్నారు. ఎవరైనా అర్హులు ఉంటే వారికి ఓటు హక్కు కల్పించి, అనర్హుల ఓట్లను తొలగించాలన్నారు.

అంతర్జాతీయ దార్శనికుడు వివేకానంద


వివేకానంద చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య

అనంతపురం: ప్రపంచ దేశాలకు భారత జాతి ఔన్నత్యాన్ని, సంస్కృతి సంప్రదాయాలను చాటి చెప్పిన అంతర్జాతీయ దార్శనికుడు స్వామి వివేకానంద అని ఎస్కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య అన్నారు. బుధవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఫార్మసీ కళాశాలలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా జాతీయ యువజన దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. యువత స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నేషనల్ యూత్ అవార్డు–2023 గ్రహీత బిసాతి భరత్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ ప్రొఫెసర్ డి.మురళీధర్ రావు, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సోమశేఖర్, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర, డాక్టర్ వరలక్ష్మీ దేవి తదితరులు పాల్గొన్నారు.

రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా మల్లికార్జున



అనంతపురం అర్బన్: రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా జిల్లాకు చెందిన చిరుతల మల్లికార్జున ఎన్నికయ్యారు. రాజమండ్రిలో ఈనెల 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకూ మూడు రోజుల పాటు జరిగిన రైతు సంఘం రాష్ట్ర మహాసభల్లో నూతన కమిటీని ఎన్నుకున్నట్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా నుంచి రాష్ట్ర కార్యదర్శిగా తనను ఎన్నుకోవడంతో పాటు రాష్ట్ర సమితి సభ్యులుగా జిల్లా నుంచి చిన్నప్ప యాదవ్, గోవిందు, వన్నారెడ్డి, బండి రామకృష్ణ, పీట్ల రామకృష్ణ, టి.నారాయణస్వామి, లతితమ్మ, వెంకటరాముడు, వెంకట నారాయణ, గోపాల నరసింహులును ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

అబ్దుల్ సత్తార్ కన్నుమూత



అనంతపురం కల్చరల్: విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు అబ్దుల్ సత్తార్ (82) కన్నుమూశారు. విషయం తెలుసుకున్న విశ్రాంత ఉద్యోగులు సత్తార్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. సంఘం ప్రతినిధులు ప్రభాకరగుప్తా, గోపాల్, ఎమ్కే నరసింహమూర్తి, రియాజుద్దీన్, కృష్ణమూర్తి తదితరులు సత్తార్ సేవలను గుర్తు చేసుకున్నారు.

13న పూలే ప్రతిభా పురస్కారాలు

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ చదివి ఉత్తమ ప్రతిభ చాటిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఈనెల 13న పూలే ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్నట్లు బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు తెలిపారు. బుధవారం సంఘం కార్యాలయంలో కరపత్రాలను విడుదల చేశారు. అనంతపురం ఆర్ట్స్ కళాశాలలో 13న ఉదయం 10 గంటలకు కార్యక్రమం నిర్వహిస్తామని సంఘం జిల్లా అధ్యక్షుడు పిడుగు శ్రీనివాసులు, ప్రధానకార్యదర్శి ఎస్.శివ ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట శ్రీధర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈజీ నాగభూషణం, జిల్లా ఉపాధ్యక్షుడు విజయనగరం నాగరాజు, జిల్లా కార్యదర్శి గోగుల శ్రీధర్, కార్యవర్గ సభ్యులు జి.రమేష్, హెచ్.రామాంజనేయులు, నారాయణ నాయక్, ఓబులేసు, శంకర్, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం

అనంతపురం క్రైం: స్థానిక 64వ సచివాలయం టౌన్‌ప్లానింగ్ సెక్రటరీ స్నేహ ఆత్మహత్యాయత్నం చేయబోతుండగా గుర్తించిన పోలీసులు ఆమెను రక్షించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. బుధవారం నగర శివారురులోని ప్రసన్నాయపల్లి రైల్వే గేటు సమీపంలో చోటు చేసుకున్న ఘటనపై అనంతపురం త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాలు.. స్నేహకు ఉన్నతాధికారులు నోటీసులు ఇవ్వడంతో సూసైడ్ చేసుకుని చనిపోతున్నట్లు వాట్సాప్ గ్రూప్‌లో సందేశాన్ని పంపింది. తోటి ఉద్యోగులు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రసన్నాయపల్లి రైల్వేగేటు సమీపంలో ఉన్న ఆమెను పోలీసులు రక్షించారు.

రఘు సైనిక్ స్కూల్‌ను సీజ్ చేయాలి

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తున్న రఘు సైనిక్ స్కూల్‌ను సీజ్ చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం డీఈఓ నాగరాజుకు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతురు పరమేష్ వినతిపత్రం అందజేశారు.

ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్రా పోటీలు


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి

అనంతపురం: ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానంలో బుధవారం 5, 6 సచివాలయాల మధ్య ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రీడా పోటీలను డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి ప్రారంభించారు.

రాప్తాడు: మండలం ప్రసన్నాయపల్లి వినయకుమార్ స్కూల్, చిన్మయనగర్‌లో ఎల్లార్జీ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో మండల స్థాయి క్రీడా పోటీలను ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మీ, వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు ప్రారంభించారు. కన్వీనర్ జూటూరు శేఖర్ ఖోఖో ఆడి క్రీడాకారులను ఉత్తేజ పరిచారు.

ఆత్మకూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆర్డీటీ క్రీడా మైదానంలో మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు నిర్వహించారు. క్రికెట్, వాలీబాల్ తదితర పోటీల్లో క్రీడాకారులు ప్రతిభ చాటారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రఘునాథ్, ఎంపీపీ హేమలత, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు బాల పాతన్న, కన్వీనర్ పూజారి లక్ష్మీనరసింహులు పాల్గొన్నారు.

అనంతపురం మెడికల్: ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి పోటీలకు ప్రభుత్వ వైద్య కళాశాల 2023 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు షటిల్ బ్యాడ్మింటన్ విభాగంలో మహాలక్ష్మి, వెన్నెల, కబడ్డీకి మురళి, విశాల్, పార్థసారథి, దీపక్ ఎంపికయ్యారు. కళాశాల డీన్ ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు విద్యార్థులను అభినందించారు.

బల్లలకు మరమ్మతులు

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలలోని మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో నిరుపయోగంగా ఉన్న బల్లలు, కుర్చీలను తిరిగి వినియోగించేలా మరమ్మత్తులు చేశారు. తక్కువ ఖర్చుతో బల్లలను తయారు చేసినట్లు వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్ధన పేర్కొన్నారు.

అనంతకు 'ఆరోగ్య భాగ్యం'

• అనంతపురంలో విస్తరిస్తున్న వైద్య, విద్య రంగాలు

అనంతపురం: వ్యాపార, వైద్య, విద్యా రంగాల్లో అనంతపురం వేగవంతంగా పురోగతి చెందుతోంది. గతంలో ఒక మోస్తరు వైద్య చికిత్స చేయించుకోవాలంటే బెంగళూరు, హైదరాబాద్ తదితర పెద్ద పెద్ద నగరాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. అయితే ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. అనంతపురంలో అన్ని సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. అధునాతన కార్పొరేట్ హాస్పిటల్స్ ఏర్పాటయ్యాయి. పలు వ్యాధులకు వైద్య చికిత్సలను ఇక్కడే చేసున్నారు. ల్యాబ్‌లు, అన్ని రకాల రక్త పరీక్షలు చేస్తున్నారు. వ్యాధులకు నిపుణులైన వైద్యులు అందుబాటులో ఉండటం అభివృద్ధికి నిదర్శనంగా చెప్పుకోవచ్చు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చొరవతో వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కళాశాల, నాడు–నేడు కింద ఆస్పత్రుల అభివృద్ధికి పెద్దపీట వేసింది. ప్రభుత్వ మెడికల్ కళాశాల ఎంతో మంది విద్యార్థులకు ఉన్నత విద్యను అందించేందుకు తోడ్పాటు అందిస్తోంది. ఫలితంగా వివిధ రాష్ట్రాలకు చెందిన మెడికల్ విద్యార్థులు విద్యను అభ్యసించేందుకు అనంతకు వస్తున్నారు.

సుందర నగరం..

అనంతపురం నగరాన్ని అత్యంత సుందరంగా ఉండేలా తీర్చిదిద్దారు. పంగల్ రోడ్డు నుంచి బళ్లారి రోడ్డు వరకూ నాలుగు లేన్ల రహదారి నిర్మించారు. ఇటీవల టవర్ క్లాక్ ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం కూడా పూర్తయింది. నగరంలో పలు విద్యా సంస్థలు ఏర్పాటయ్యాయి. ఎస్కేయూ, జేఎన్‌టీయూ అనంతపురం, సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, శ్రీ సత్యసాయి హయ్యర్ ఎడ్యుకేషన్ తదితర విద్యా సంస్థలు ఉన్నాయి. పెళ్లిళ్లు, పేరంటాళ్లకు నూతన వస్త్రాలు కావాలన్నా, ఏ ఖరీదులో కావాలన్నా ఇక్కడే లభ్యం అవుతున్నాయి. నగరంలో ప్రముఖ షాపింగ్ మాల్స్ సైతం ఏర్పాటయ్యాయి. 44 జాతీయ రహదారి రెస్టారెంట్ల హబ్‌గా మారింది. ఆర్డీటీ సంస్థ ఏర్పాటుతో ఎంతో మంది విదేశీయులు అనంతపురం సందర్శిస్తున్నారు. పర్యాటకంగా కూడా అనంతపురానికి ప్రత్యేక గుర్తింపు లభిస్తోంది.

మెరుగైన సేవలందించాలి

అనంతపురం మెడికల్: విధి నిర్వహణలో అంకితభావంతో పని చేసి పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి పేర్కొన్నారు. బుధవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ మీడియా ఆఫీసర్స్ 2024 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. ఆరోగ్య సమాచారాన్ని ప్రజలకు చేరవేయడంలో డెమో సిబ్బంది పాత్ర ఎంతో కీలకమన్నారు. వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తిస్తే నయం చేయవచ్చన్న సమాచారం, ప్రభుత్వం అందిస్తున్న సేవలను ప్రజలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో మాస్ మీడియా అధికారి ఉమాపతి, హెచ్ఈఓ సత్యనారాయణ, డిప్యూటీ డెమో త్యాగరాజు, డిప్యూటీ హెచ్ఈఓ గంగాధర, సూపరింటెండెంట్లు విజయభాస్కర్ రెడ్డి, శ్రీనివాసులు, ఆరోగ్య బోధకులు వేణుగోపాల్, సుబ్రహ్మణ్యం, వెంకటేశ్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.